

రాయపర్తిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

## బీఆర్‌ఎస్ విజయానికి శ్రేణులు కృషి చేయాలి

- ఆరు గ్యారెంటీలను విస్మరించిన కాంగ్రెస్
- ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్న పెట్టుబడిదారులు
- నాపై కావాలనే తప్పుడు ప్రచారం
- కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తా..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్/రాయపర్తి, జూలై 29 : త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ శ్రేణులు పని చేయాలని, అత్యధిక స్థానాల్లో విజయం సాధించేలా కృషి చేయాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి, వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రాల్లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఉన్న అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల పెట్టుబడిదారులు తమ కార్యకలాపాల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమరావతి, వైజాగ్‌ల వైపు చూస్తున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వంలో లుక లుకలు తారస్థాయికి చేరుకుంటున్నాయన్నారు. సుస్థిర ప్రభుత్వాన్ని నడిపే దమ్ము, ధైర్యం రేవంత్‌రెడ్డికి లేవన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను బీఆర్‌ఎస్‌లోనే ఉంటానని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందని, రైతు భరోసాకు దిక్కులేదన్నారు. రూ.2 లక్షల పంట రుణాల మాఫీ సక్రమంగా అమలు చేయడం లేదని, రైతులు బ్యాంకులు, సొసైటీల చుట్టూ తిరుగుతున్నారని ఎర్రబెల్లి విమర్శించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించిన మ్యానిఫెస్టోలో ఆసరా పింఛన్లను రెట్టింపు చేసి ఇస్తామని చెప్పిన మాట ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతలు అదుపులో లేవని ధ్వజమెత్తారు. సీఎం, మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడికి రేవంత్‌రెడ్డి దాసోహమడం ఖాయమని, తెలంగాణలోని సహజ వనరులను మరోసారి ఆంధ్ర పాలకులు లూటీ చేస్తారని అనుమానం వ్యక్తం చేశారు.

**బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి..**

దేశ చరిత్రలో ప్రజలకు మంచి చేసిన ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమేనని, కేసీఆర్ పాలనలో తెలంగాణలో అభివృద్ధి జరిగిందని ఎర్రబెల్లి అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. వారం రోజుల్లో గ్రామ కమిటీల సమావేశాలు నిర్వహిస్తానని చెప్పారు. సమావేశాల్లో బీఆర్‌ఎస్ నాయకులు గుడిపూడి గోపాల్‌రావు, బిల్లా సుధీర్‌రెడ్డి, నల్లా నాగిరెడ్డి, పుస్కూరి శ్రీనివాస్‌రావు, పసునూరి నవీన్, వీరమనేని యాకాంతారావు, కారుపోతుల వేణు, మాచర్ల ఎల్లయ్య, ఎండీ మదార్, గుగ్గిళ్ల యాకయ్య, జోగు గోపి, మహ్మద్ నయీం, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, ఆకుల సురేందర్‌రావు, పూస మధు, గారె నర్సయ్య, చిట్యాల వెంకటేశ్వర్లు, కుందూరు రాంచంద్రారెడ్డి, బోనగిరి ఎల్లయ్య, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ అక్బర్, కోదాటి దయాకర్‌రావు, ముద్రబోయిన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


గతేడాది జిల్లాలో మత్స్యసంపద



మత్స్యకారులకు ఉపాధి చూపే చేపపిల్లలు ఈసారి ఇంకా చెరువును చేరలేదు. కులవృత్తులకు పెద్దపీట వేసిన గత బీఆర్‌ఎస్ సర్కారు ఏటా ఈ సమయానికి సీడ్ అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడింది. అయితే ఇటీవల అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు ముదిరాజ్‌లకు ఉచిత చేపపిల్లల పంపిణీ పథకంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై వారిలో ఆందోళన వ్యక్తమవుతున్నది. గతేడాది ఈ సమయానికి భూపాలపల్లి జిల్లాలో రూ.3 కోట్ల సీడ్‌ను చెరువుల్లో వదలగా, ఈ ఏడాది మాత్రం ఇప్పటి వరకు టెండర్లు ఖరారు కాకపోవడంతో వారి ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది.

– జయశంకర్ భూపాలపల్లి, జూలై 29 (నమస్తే తెలంగాణ)

# చెరువుకు చేప చేరేదెన్నడో?

## ఇప్పటికీ ఖరారు కాని చేపపిల్లల టెండర్లు

- మత్స్యకారుల ఉపాధి ప్రశ్నార్థకం
- భూపాలపల్లి జిల్లాలో 3కోట్ల సీడ్ వేసిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- ఆర్థికంగా అభివృద్ధి చెందిన ముదిరాజ్‌లు
- 116 సొసైటీలు.. 8785 మంది సభ్యులు

కులవృత్తులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పూర్వవైభవం తీసుకొచ్చిన ఘనత గత కేసీఆర్ సర్కార్‌దే. కాగా, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ వస్తున్నది. ఈ క్రమంలో ముదిరాజ్‌లకు చేయూతనిచ్చిన ఉచిత చేప పిల్లల(సీడ్) పంపిణీ పథకాన్ని సైతం కాలరాస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు చేప పిల్లల పంపిణీకి సంబంధించి టెండర్లు నిర్వహించకపోవడంతో ముదిరాజ్ కులస్తులు ఆందోళన చెందుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏటా ఈ సమయానికే టెండర్లు నిర్వహించి చేప పిల్లలను చెరువుల్లో వదిలేది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2022–23వ సంవత్సరంలో 3కోట్లు, 2023–24లో 2.57 కోట్ల చేప పిల్లలను ఆగస్టు మొదటి వారంలోపే చెరువుల్లో వదిలింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది ఇప్పటివరకు చేప పిల్లల పంపిణీ పథకం ఊసెత్తకపోవడంతో జిల్లాలోని116 సొసైటీల్లోని సభ్యులఉపాధి ప్రశ్నార్థకంగా మారింది.

**టెండర్లు రద్దు చేశారెందుకో ?**


ఆలస్యంగానైనా చేప పిల్లల పంపిణీకి టెండర్లు పిలిచిన ప్రభుత్వం మళ్లీ ఎందుకు రద్దు చేశారని మత్స్యకారులు మండిపడుతున్నారు. ఈ నెల 23న టెండర్లకు చివరి తేదీగా నిర్ణయించిన ప్రభుత్వం టెండర్లు ఓపెన్ చేయాల్సి ఉందని ఆ శాఖ అధికారులే ప్రకటించారు. కానీ, ఉన్నట్లుండి టెండర్లను వాయిదా వేశారు. టెండర్లలో కాంట్రాక్టర్లు ఎవరూ పాల్గొనలేదా..? కావాలనే వాయిదా వేశారా..? ఈ ఏడాది సీడ్ పంపిణీ ఉంటుందా లేదా..? అనే అనుమానాలు మత్స్యకారుల్లో తలెత్తుతున్నాయి. ఏటా జూలైలో టెండర్లు నిర్వహించి ఆగస్టు మొదటి వారంలోపే చేప పిల్లల పంపిణీ జరిగేది. ఆగస్టు 2న టెండర్లు నిర్వహిస్తారని అధికారులు చెబుతున్నప్పటికీ టెండర్లు, ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసి, కాంట్రాక్టర్లను ఫైనల్ చేసి ఎప్పుడు సీడ్ పంపిణీ చేస్తారని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 116 సొసైటీలు 8785 మంది సభ్యులు ఉన్నారు. గత ప్రభుత్వం 833 చెరువుల్లో చేపపిల్లల సీడ్ వేసింది. భూపాలపల్లి మండలంలో 17 సొసైటీలు 1221 మంది సభ్యులు ఉన్నారు. చిట్యాలలో 13 సొసైటీలు 1013 సభ్యులు, ఘణపురంలో 9 సొసైటీలు 1341 సభ్యులు, కాటారంలో 8 సొసైటీలు 356 సభ్యులు, మహదేవపూర్‌లో 7 సొసైటీలు 381 సభ్యులు, మహాముత్తారంలో 3 సొసైటీలు 141 సభ్యులు, మల్హార్‌లో 6 సొసైటీలు 574 సభ్యులు, మొగుళ్లపల్లిలో 12 సొసైటీలు 721 సభ్యులు, పలిమెలలో ఒక సొసైటీ 35 సభ్యులు, రేగొండలో 27 సొసైటీలు 2294 సభ్యులు, టేకుమట్లలో 13 సొసైటీలు 708 సభ్యులు ఉన్నారు. జిల్లాలోని రేగొండ మండలంలో అధికంగా సొసైటీలు, సభ్యులు ఉన్నారు.

గత ఏడాది అన్నారం బరాజ్‌లో చేప పిల్లలను వదులుతున్న అధికారులు (ఫైల్)



# డెంగీతో బాలుడి మృత్యువాత

- వైద్యుల నిర్లక్ష్యంతోనేనని కుటుంబసభ్యుల ఆరోపణ
- దవాఖాన ఎదుట బంధువులతో కలిసి ధర్నా



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు, (ఇన్‌సెట్‌లో)జీవన్ (ఫైల్)

హనుమకొండ/చెన్నారావుపేట, జూలై 29 : డెంగీ లక్షణాలతో మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని చక్రవర్తి హాస్పిటల్‌లో చేరిన బాలుడు జీవన్(13) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందగా, వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారావుపేట మండలం బోడమాణిక్యం తండాకు చెందిన భూక్యా మోహన్–ఉమా దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు. కుమారుడు జీవన్(13)కు వారం రోజుల నుంచి జ్వరం రావడంతో నర్సంపేటలోని ఓ దవాఖానలో చూపించారు. డెంగీ లక్షణాలు కనిపించగా మెరుగైన వైద్యం కోసం బాలసముద్రంలోని చక్రవర్తి దవాఖానకు తీసుకురాగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. జ్వరం తగ్గుతుందని హనుమకొండలోని ఆస్పత్రికి వస్తే వైద్యుల నిర్లక్ష్యంతో తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు బోరున విలపించారు. హాస్పిటల్ ఎదుట ధర్నా చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న సుబేదారి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గొడవలు జరుగకుండా భద్రతా చర్యలు తీసుకున్నారు. ఈ విషయంపై దవాఖాన డాక్టర్ తరుణ్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సాంబశివరావు ఆదేశాల మేరకు అదనపు డీఎంహెచ్‌వో ఆస్పత్రికి వెళ్లి విచారణ చేసినట్లు సమాచారం. బాలుడి మృతిలో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇటీవలే పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్న కుమారుడు చిన్న వయసులోనే మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

# ప్రభుత్వ వేతనం.. ప్రైవేటులో వైద్యం..

## హనుమకొండ ప్రసూతి ఆస్పత్రి వైద్యుల తీరిది




- హాజరు వేసుకొని సొంత ఆస్పత్రులకు పరుగులు
- మరికొందరు హైదరాబాద్ నుంచి అప్ అండ్ డౌన్
- ఎవరు ఎప్పుడొస్తరో తెలియని దుస్థితి
- గర్భిణులకు వైద్య సేవలు అంతంత మాత్రమే



హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి

హనుమకొండ చౌరస్తా, జూలై 29 : పేద గర్భిణులకు పెద్ద దిక్కుగా ఉన్న ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి (జీఎంహెచ్)లో వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ప్రైవేట్‌లో వైద్యం ఆర్థిక భారంగా మారడంతో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్‌కు చెందిన అనేక మంది గర్భిణులు ఈ ఆస్పత్రినే ఆశ్రయిస్తుంటారు. అయితే ఇక్కడ పనిచేసే డాక్టర్లలో ఎవరు ఎప్పుడు వస్తరో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దవాఖానలో 60 మందికిపైగా వైద్యులుండగా, సీనియర్లు హాజరు వేసుకొని సొంత క్లినిక్‌లకు వెళ్తుండగా, జూనియర్లే వైద్య సేవలందిస్తున్నారు. దీనికితోడు ఇక్కడ గైనకాలజీ డాక్టర్లు లేకపోవడంతో పీజీ డాక్టర్లే వారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక హైదరాబాద్ నుంచి అప్ అండ్ డౌన్ చేసే అసోసియేట్ ప్రొఫెసర్ల విషయం ఎవరికీ తెలియదు. ప్రస్తుతం ఈ దవాఖాన నుంచి బదిలీపై వెళ్లిన వారు ఎంతమంది? పనిచేస్తున్నది ఎవరు? అన్న సమాచారమేలేదు. రూ. లక్షల్లో జీతాలు తీసుకుంటున్నప్పటికీ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ తమ సొంత ఆస్పత్రులకే ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నది. డ్యూటీ చేసే డాక్టర్లు ఉదయం 9, సాయంత్రం 4 గంటలకు బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగానే డాక్టర్లకు వేతనాలు చెల్లిస్తారు. అయితే ఈ విధానం సైతం గందరగోళంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఇందులోనూ పలు అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక నవజాత శిశువులకు వైద్య సేవలందించే పిల్లల వార్డులో ముగ్గురు నుంచి నలుగురు డాక్టర్లు షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఏకంగా ఏడుగురు డాక్టర్లు విధులు నిర్వర్తిస్తుండడం విస్మయం కలిగిస్తున్నది. ఎంజీఎం, కేఎంసీ, సీకేఎం ఆస్పత్రుల్లో పీడియాట్రిక్ డాక్టర్ల కొరత ఉన్నప్పటికీ ఇక్కడి నుంచి ఎవరినీ పంపడం లేదు. వీరు కూడా హాజరు వేసుకొని వారి సొంత దవాఖానలకు వెళ్తున్నారు. ఈ విషయమై కలెక్టర్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దృష్టి సారించి విధులకు హాజరుకాని వైద్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**అందరూ వస్తున్నారు**

జీఎంహెచ్ డాక్టర్లు రెగ్యులర్‌గా విధులకు హాజరవుతున్నారు. హైదరాబాద్ నుంచి కూడా డాక్టర్లు వస్తున్నారు. బయోమెట్రిక్ హాజరు వివరాలు మెడికల్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం), హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కు ఆన్‌లైన్ ద్వారా చేరుతుంది. ఆస్పత్రిలో వైద్య సేవలు అందరికీ అందుతున్నాయి.

– బీ విజయలక్ష్మి, సూపరింటెండెంట్, జీఎంహెచ్



## భయం భయంగా.. ప్రయాణం


**ఏటూరునాగారం–రామన్నగూడెం మార్గంలో ప్రమాదకరంగా భారీ వృక్షాలు**

ప్రస్తుత వర్షాకాలంలో ఈదురుగాలులకు చెట్లు, కొమ్మలు విరిగిపడి రోజూ ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఏటూరునాగారం-రామన్నగూడెం మార్గంలో ఇరువైపులా నేలను తాకేలా ఉన్న ఈ భారీ వృక్షాలు ప్రయాణికులను భయపెడుతున్నాయి. ఈ దారిలో సుమారు 40 పెద్ద చెట్లు ఉండగా ఇప్పటికే కొన్ని కొమ్మలు ఎండిపోయి కిందపడుతుండడంతో వాటి కింది నుంచి వెళ్లేందుకు వాహనదారులు, మార్నింగ్ వాక్ చేసే వాళ్లు జంకుతున్నారు. ఇటీవల ఏటూరునాగారం-చిన్నబోయినపల్లి మార్గంలో వర్షంలో బైక్‌పై వెళ్తున్న జహంగీర్‌ను ఓ భారీ వృక్షం పొట్టన పెట్టుకున్న నేపథ్యంలో ఎలాంటి దుర్ఘటనలు జరుగక ముందే ఎండిన కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- ఏటూరునాగారం, జూలై 29

# స్మృతివనం.. బర్రెలకు ఆవాసం!

- అధ్వానంగా పాలకుర్తి సోమనాథుని క్షేత్రం
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- పరిరక్షించాలంటున్న సాహితీప్రియులు


పేడతో అధ్వానంగా సోమనాథ స్మృతివనం


గడ్డి, మొక్కలను బర్రెలు మేయడంతో కళావిహీనంగా ఆవరణ

పాలకుర్తి రూరల్, జూలై 29 : పాలకుర్తి సోమనాథుడి స్మృతివనం బర్రెలకు ఆవాసంగా మారి అధ్వానంగా తయారైంది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ఇష్టంతో, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చొరవతో అద్భుతంగా రూపుదిద్దుకున్న ఈ కట్టడం ఇప్పుడు పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో వైభవం కోల్పోతున్నది. గత బీఆర్‌ఎస్ సర్కారు పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సమీపంలో సుమారు రూ.2కోట్లతో సోమనాథుడి స్మృతివనాన్ని అతి సుందరంగా నిర్మించింది. అయితే నిర్వహణ లేమితో స్మృతివనం అంతా బర్రె పేడతో కంపుకొడుతున్నది. కొందరు రోజూ అక్కడ బర్రెలను కట్టేస్తుండడంతో అవి మొక్కలు, పచ్చని గడ్డిని తినేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంతో కళకళలాడిన ఈ పర్యాటక ప్రదేశాన్ని పరిరక్షించాలని సాహితీప్రియులు కోరుతున్నారు.


చిల్డ్రన్స్ నోటుతో బాధితురాలు

# చిల్డ్రన్స్ నోటుతో బురిడీ

- గణపురం సంతలో రూ. 500 కాగితం ఇచ్చి మోసం
- లబోదిబోమంటున్న మహిళా కూరగాయల వ్యాపారి

గణపురం, జూలై 29: మండల కేంద్రంలో సోమవారం జరిగిన సంతలో చిల్డ్రన్స్ నోటుతో ఓ వ్యక్తి మహిళా కూరగాయల వ్యాపారిని బురిడీ కొట్టించాడు. వివరాలిలా ఉన్నాయి. రేగొండ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన సూర వనిత మండల కేంద్రంలో జరిగే సంతలో కూరగాయాలు విక్రయించడానికి వచ్చింది. ఈ క్రమంలో ఓ ఆకతాయి చిన్న పిల్లల చాక్లెట్లకు వచ్చే రూ. 500 ఇచ్చి కూరగాయలు తీసుకోగా రూ. 30 తీసుకొని రూ. 470 ఇచ్చింది. గిరాకీ ఎక్కువగా ఉండి రాత్రి కావడంతో ఆమె గమనించలేదు. అతడు వెళ్లాక ఆ నోటును చూసి లబోదిబోమంది.

# ఆశవర్కర్ల ముందస్తు అరెస్టు

మట్టెవాడ, జూలై 29 : రాష్ట్ర ప్రభుత్వం ఆశవర్కర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం లేదని నిరసిస్తూ చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో హైదరాబాద్‌కు వెళ్లే ఆశవర్కర్లను ముందస్తుగా మట్టెవాడ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు కాసు మాధవి, జిల్లా కార్యదర్శి ముక్కెర స్వామి మాట్లాడుతూ ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం చలో హైదరాబాద్‌కు వెళుతున్న వారిని ప్రభుత్వం ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. అధికారంలోకి రాక ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఆశవర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంతోపాటు వారికి ప్రధాన డిమాండ్ అయిన రూ.18 వేల జీతాన్ని ఇస్తామని చెప్పి, ఇప్పుడు ముఖం చాటేయడం దారుణమన్నారు. చేసేదేమి లేక ఆశవర్కర్లు తమ నిరసన గళాన్ని వినిపించేందుకు హైదరాబాద్‌కు వెళుతుంటే మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారని ఆరోపించారు. సమస్యలు నెరవేరే వరకూ తమ ఉద్యమం ఆగదన్నారు. అరెస్టయిన వారిలో అనిత, మరియ, రాణి, పద్మ, కవిత, గీత, మమత, జ్యోతి, శోభ తదితరులు ఉన్నారు.


మట్టెవాడ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆశవర్కర్లు